# అదృష్టచిహ్నం

వన్నె తక్కువైనా వంశమెరిగింది పెళ్ళాం. ఆడబిడ్డయినా అదరి పడినట్లు మెసలుతోంది. సంసారం జానడైనా ఖర్చు మాత్రం బారెడు కాకుండా చూస్తోంది.

సమయానికి ఏదీ దొరక్కపోయినా అతడు అప్పులు మెప్పులూ యిచ్చే పరపతి జోలికి పోకుండా చేస్తోంది.

అతను పేదవాని స్నేహం వదలక పోవడానికీ పెద్దవానితో విరోధం తెచ్చుకోక పోవడానికి కారణం ఆమే. అందుకే ఈ రెక్కాడితే గానీ డొక్కాడని జీవితంలో యిలా అదృష్టమంతా పెళ్ళామేనని సంతుష్టితో బతుకుతున్నప్పుడు ఒకనాడు యెదురు చూడని అదృష్టం అకస్మాత్తుగా రాంబాబును ఆవరించింది. దూరపు చుట్టం ఒకరు సంపాదించి, తన వారెవరూ లేరని, రాంబాబును అదంతా అనుభవించమని వీలునామా రాసిపోయాడు. ఈ సంపద దొరికిందనగానే ఆపదల్లో అరచిన అరపులన్నీ మరచిపోయాడు. ఇందులో వంతుకు గెంతేసి కోర్టుకి లాక్కెళ్ళేవారెవరూ లేరు అంచేత యెంతో సుళువుగా డబ్బు చేతి కొచ్చింది.

ఈ డబ్బేం చెయ్యటం? ఇంతవరకూ, బతకడానికి తిన్నారు. ఒళ్ళు కప్పుకోడానికి బట్టలు కట్టారు. కానీ వుండడానికి నానా తిప్పలు పడ్డారు. అద్దెయిళ్ళల్లో యెలాగున్నైనా తలదాచుకుని సర్దుకుందామన్నా యేదో ఒక బాధ. దొడ్డి వుంటే నీరు లేదు. నీరు వుంటే దొడ్డిలేదు. పట్నంల్లో అద్దెకుండే తాహతు కదా, వందలిచ్చి పెద్ద యిల్లెక్కడ అద్దెకు తీసుకోగలరు? నెల నెలా పెరుగుతున్న అద్దెలే నిజానికి ఈ కుటుంబానికి ఆపద అరువులై పోయాయి.

ఈ డబ్బుతో తలదాచుకోడానికి ఒక యిల్లు కట్టుకోవాలని రాంబాబు నిర్ధారించాడు. అయితే పట్నంలో జాగా దొరకటం అంత సులువా? దొరికినా ఆ జాగాధరతో ఒక యిల్లే కట్టేవచ్చు. అందుకే విసిగి చివరకు పట్నం బయట నాలుగు వందల గజాలు జాగా కాస్త చౌకగా కొన్నాడు.

ఆ జాగా చూసినప్పుడు అక్కడక్కడా పుట్టలూ, చెట్లూ, పశులూ, ఉడతలూ, దగ్గరగా నున్న పొలాల గట్లపై ఎలుకలూ చూశాడు. తను త్రోవ తీస్తే తన వెంట యెందరో వస్తారని యిలా సాహసించాడు. అర్నెల్లు చూసినా యెవరూ తన చుట్టుపట్ల జాగాలు తీసుకోకపోగానే, తన జాగాలో యీశాన్య దిక్కున ఒక నుయ్యి తవ్వించాడు. పదిహేను అడుగుల్లోనే తియ్యని నీరు పడింది. ఈ వార్తతో మరో ఐదుగురు తన చుట్టు పట్ల జాగాలు తీసుకున్నారు. ఎప్పుడైనా దానికి విలువ రాదా అని కొన్నారు కానీ యిల్లు కట్టిద్దామని కాదు. తను యిల్లు కట్టితే మిగతా వాళ్ళకు వేడి పుడ్తుందని యిల్లు కట్టే ప్రయత్నంలో పునాదులు తియ్యకుండానే అలసిపోయాడు. ఎన్నో ఆఫీసులు తిరిగాడు. ఎందరికో మొక్కుబడులు చెల్లించాడు. ఒకసారి విసిగి "బాబూ! నేను ఒకరి దగ్గర పుచ్చుకోలేదు కదా?" అని ఒకరి దగ్గర గొణిగితే—

"కష్టార్జితంతో యిల్లు కట్టిస్తున్నావా? నేను నమ్మను'' అనేసి పుచ్చుకో వలసిన మామ్మూలు పుచ్చుకున్నాడు.

లారీతో పోయించిన యిసుకలోనే యింత కల్తీ వుంటే మరి సిమెంటులో యెంత వుంటుందో?

బతిమాలినా, అడిగినంత కూలీ యిచ్చినా పనివాళ్ళ దర్జా పనివాళ్ళది. మనిషి యింకో మనిషిపై చేసే నిర్దాక్షిణ్యమైన నిలువు దోపిడిని యెదిరించే ధైర్యం లేక గత్యంతరం లేక తల ఒగ్గి యెలాగో యిల్లు నిలబెట్టుకున్నాడు. ఇంట్లో దిగేసరికి రాంబాబు తను యెన్నడూ చేయననుకున్న పనులు చెయ్యటంతో మానసికంగా మాసిపోయాడు. ఆర్థికంగా అలసిపోయాడు. ఆరోగ్యం పాడు చేసుకున్నాడు.

ఇంట్లో దిగాక మాత్రం అద్దె యింట్లో హీనం పోయి, స్వంత యింట్లో మానంతో బతుకుతున్నామన్న హాయి వచ్చింది. బంధువులతో పాటు యింటికి

యెలకల రాకపోకలు కూడా ఆరంభమైనాయి. చుట్టాలు తినిపోయినట్లు యిపీ పోతాయనుకుంటే రాత్రుళ్ళు నిద్రను భంగం చెయ్యటం మొదలు పెట్టాయి. ఇక విసిగి లాభం లేదని ఒక పిల్లిని పెంచాడు. ఆ పిల్లి యెలకలను పట్టేకన్నా పిల్లలను పెట్టి పదిచోట్లకు తిప్పటం మొదలు పెట్టింది.

ఎలకల బాధతో పాటు యిప్పుడు పిల్లుల బాధ కూడా తట్టుకోవలసి వస్తోంది. ఒక్కరోజునే రెండు అనర్థాలు. పెట్టిలో దూరి యెలకలు బట్టలు కొట్టేశాయి. పిల్లులు శేరు పాలు తాగేశాయి. రాంబాబు తొలిసారి జీవహింస చేశాడు. ఆ రాత్రి యించుమించు వేటాడి పడక గదిలో ఒక ఎలకను చంపాడు. ఐనా ఆ మరుసటి రోజు రాత్రి యెలకల బాధ హెచ్చిందిగానీ తగ్గలేదు. రాను రాను 'ప్లేగు' వస్తుందేమో నన్న భయం రాగనే, దొంగల ముఠాల్లా దాడి చేస్తున్న యీ యెలుకల మీద బ్రహ్మాస్త్రం వేశాడు. ఎలికల మందు తిని యెలుకలతో పాటు పిల్లి కూడా చచ్చింది.

బొద్దింకలు మందలుగా దాడి చేస్తుంటే యింటి బయట పామును చూశాడు. వీటన్నిటితో పోరాటానికి తనో వీరుడు కావలసి వచ్చింది. ఇప్పటి రాంబాబులో ఒకనాటి విశ్వాసం "అహింసా పరమోధర్మః" పూర్తిగా పోయింది. సహనం చచ్చింది. దయాదాక్షిణ్యాలు కరడు కట్టుక పోయాయి. తన అదృష్టాన్ని భక్షించే దొంగలు లావయ్యారన్న అనుమానం. ఇల్లు కట్టేటప్పుడు మనుషులు దోచుక తిన్నారు. ఇల్లు కట్టాక జంతువులు దోచుకు తింటున్నాయి. మనుషులనేమీ చెయ్యలేకపోయానన్న అక్కసును యీ తేళ్ళూ, జెర్రులూ, బొద్దింకలూ, యెలకలూ, పాముల మీద తీర్చుకుంటున్నాడు. చంపేతత్వం యెదుర్కొనే తత్వం ప్రబలి పోయింది. ఒకనాడు తన అదృష్టమని నమ్మిన భార్య మీదే ఒకోసారి విసవిసలాడి పోతున్నాడు. నిత్యం మనసులో మెసలుతున్న భయమే ఒక నాటి రాత్రి యింట్లో పడ్డ దొంగతో పోరాటానికి దింపింది. ఈ పోరాటంలో యిద్దరికీ దెబ్బలు తగిలాయి. దొంగకు కాలు విరిగిపోయింది. రాంబాబుకు చేతిమీద, తలమీద దెబ్బలు తగిలాయి. ఇద్దరినీ ఆసుపత్రిలో చేర్చారు. ఒకే వార్డు. దొంగ విరిగిన కాలు తీయవలసిన పరిస్థితి రావచ్చు. రాంబాబును చూడడానికి చుట్టాలు, మిత్రులూ వస్తున్నారు. దొంగ దగ్గర యెవ్వరూ లేరు. వాడో పిల్లిలా, బొద్దింకలా, యెలకలాగానే రాంబాబుకు కనిపిం చాడు. తన దగ్గరకు వచ్చిన వాళ్ళంతా యిక్కడి నుంచే వాడివేపు చూసి "దొంగ వెధవ. ఎన్ని దొంగతనాలు చేసాడో? పాపం పండింది. అందుకే కాలు విరిగింది" అనేవారు.

ఇలా వాడిని దూషించి రాంబాబు ధైర్యానికి మెచ్చుకొంటున్నారు. రాత్రి. వార్డు మూగబోయింది. రాంబాబుకు అర్ధరాత్రయినా నిద్దర రాలేదు. కాసేపట్లో

చిన్న మూలుగు వినిపిస్తోంది. బహుశః మత్తునించి బయటపడ్డాడేమో ఆ దొంగ. వాడే మూలుగుతున్నాడని రాంబాబు పోల్చుకున్నాడు ఏదో మాటాడుకుంటు న్నాడు. వాడికీ యే వూర్లోనో పెళ్ళాం, పిల్లలూ వుండి వుంటారు. వాడిచేతిలోనే ఒక కత్తివుంటే తను చచ్చేవాడే. ఒక రివాల్వర్ వుంటే తను అంత సాహసం చేసి కర్రతో వాడి కాలు విరగొట్టేవాడా? అందుకే ఆ దొంగను యెలకను వేటాడి నట్లు వేటాడేడా?

ఇంకా మూలుగు వినిపిస్తుందే గాని నర్సు రాలేదు. రాంబాబు నడిచే పరి స్థితిలో వున్నాడు. దాహమో ఆకలో? మెల్లగా లేచాడు. దొంగ పడున్న బెడ్ దగ్గరకు వెళ్ళాడు.

''ఏం కావాలి?''

''దాహం.... దాహం.''

అక్కడ మంచినీరు లేవు. తన దగ్గర నున్న సీసాలోని మంచినీరు తీసుక వెళ్ళి వాడి నోటిలో పోశాడు. తాగాక—

''ఎవరు?''అన్నాడు వాడు.

''ఏం యింట్లో దూరావో ఆ యింటి....''

ఆ మసక వెలుగులో కళ్ళు బాగా తెరచి చూశాడు దొంగ.

''తినడానికి వుంటే నీ యింటి మీదెందుకు పడతాను? ఇద్దరం బతికి పోయాం.... అంతే చాలు.''

ఈ మాటలు తన యింట్లోనికి వచ్చిన ప్రతి ప్రాణి అన్నట్లు అనిపించింది. మెల్లగా రాంబాబు తన బెడ్ మీదకు తిరిగి వచ్చాడు. ఆ క్షణంలో మళ్ళీ తను యిదివరకటి రాంబాబుగా మారాననుకున్నాడు. భయం లేదు, కోపం లేదు, అసూయలేదు, చిరాకులేదు, ఈ మనసుతో ఆలోచిస్తే.

''మనిషి దోచుకుంటాడు లేక దోపిడికి గురి అవుతాడు. దోచుకున్న సంపద అది. దానితో యిల్లుకట్టి అందులో దోపిడికి గురి అయ్యాను. సుఖాన్ని పోగొట్టుకున్నాను.''

పాత రోజులు, పాత అదృష్ట చిహ్నం జ్ఞప్తికి వచ్చి, యెంత వేగిరం భార్యకు క్షమాపణ చెప్పుకుందామా అని యెదురుచూశాడు. *

(1986)